వీళ్ళ తాలూకు కుటుంబ సభ్యులెప్పుడూ తమకు వీళ్ళనుంచి తగిన ప్రాధాన్యత లభించడం లేదని వాపోతూ వుంటారు. అసలు తమ వాళ్ళకి తప్ప, మిగతా వాళ్ళందరికీ వీళ్ళ మనసులో మొదటి స్థానం వుంటుంది. ఇటువంటి తల్లిదండ్రులు మారాలంటే నియమాలు పాటించాలి.

1. తమకున్న మిత్రుల ఇన్ఫ్లుయెన్స్‌ను, చాలామందితో తమకున్న పరిచయాలను తమ పిల్లల ఉన్నతికోసం వాడుకుంటూ వుండాలి.

2. తమ పిల్లలు సాధించిన కార్యాలను ఎక్కువ మెచ్చుకుంటూ వుండాలి. తమ పిల్లలకన్నా అవతలి పిల్లవాళ్ళు ఎక్కువ విజయం సాధించినా కూడా దానిని గుర్తించనట్టే కనపడాలి. ఎప్పుడూ పక్కపిల్లవాడ్ని పొగడటం లాంటివి చేయకూడదు.

3. తమ పిల్లలముందే పక్కిటి పిల్లవాళ్ళతోనో, బంధుమిత్రుల పిల్లలతోనో అవసరమైనదానికన్నా ఎక్కువ చనువుగా వుంటే, మన పిల్లలలో ఈర్ష్యా, అసూయలు పెరగడానికి ఆస్కారం వుంది. 'తామెంతో, బయటివాళ్ళు కూడ అంతే' అన్న ఫీలింగ్ పిల్లలలో కలగకుండా వుండటానికి వీళ్ళు ప్రయత్నించాలి.

4. సమయం యొక్క విలువ తెలుసుకోవాలి. చివరికి పిల్లలతో లోకాభిరామాయణం మాట్లాడాల్సి వచ్చినా సరే ఎంతవరకు ఉపయోగపడుతుంది అని ఆలోచించాలే తప్ప "స్కూల్లో ఎన్ని గంటలకు లంచ్? మీ బెంచీలో ఎంతమంది పిల్లలు కూర్చుంటారు?"లాంటి చవకబారు టాపిక్స్‌తో సమయం వృధా చేయకూడదు.

5. తమకి అవసరం లేకపోయినా, చేతకాకపోయినా అవతలి వాళ్ళతో ఆ విషయం ఖరాఖండిగా చెప్పి, ఆ సమయాన్ని తమ భార్యాపిల్లల కోసం వినియోగించుకోవాలి. ఇదే స్త్రీలయితే పక్కింటి వాళ్ళతో కబుర్లు చెప్పే 'టైం' ని కొంత తగ్గించుకుని, తమ పిల్లల కోసం వినియోగించవలసి వుంటుంది.

6. సాధారణంగా ఇటువంటి వాళ్ళని పక్కింటివాళ్ళు, వీధిలోవాళ్ళు ఎక్కువగా మెచ్చుకుంటుంటారు. కాబట్టి అటువైపు ఆకర్షితులయ్యే ప్రమాదం వుంది. 'మెచ్చుకోవడం' అనేది వాళ్ళకి సహాయం చేసినప్పుడో అందువల్ల అవతలవాళ్ళకి లాభమే తప్ప నష్టం లేదు కనుక మెచ్చుకుంటూనే వుంటారు. దానివల్ల తమకొచ్చే లాభమేమీ లేదు కనుక ఆ సమయాన్ని తమ పిల్లలకోసం వినియోగించుకోవాలని ఈ తరహా తల్లి దండ్రులు తెలుసుకోవాలి.

7. తమ పిల్లలు తమని ఎంతగానో ప్రేమించాలనే ఉద్దేశ్యంతో ప్రవర్తించకూడదు.

మర్యాద రామన్నలు :

చాలామంది తల్లిదండ్రులు 'మర్యాద రామన్న'ల్లాగా మంచిగా, ధర్మంగా, నిజాయితీగా వుంటారు. వీళ్ళకు సరదా అంటే అస్సలు గిట్టదు. స్నేహితుల చుట్టూ తిరిగే అలవాటు

వుండదు. వీళ్ళకుండే స్నేహాలన్నీ 'గంగిగోవుపాలు గరిటెడైనా చాలు' అన్నట్లుగా వుంటాయి. వీరు అవసరమైన చోటకన్నా, అనవసరమైన చోట ఎక్కువ నిజాయితీగా వ్యవహరిస్తారు. చాలామంది మిత్రులతో తిరగడం కన్నా, కేవలం ఒకరిద్దరు మిత్రులతో ఎక్కువ క్లోజ్‌గా వుండడం మంచిదనుకుంటారు.

వీరు మంచి శ్రోతలు. ఆఖరికి కూరగాయల వాడొచ్చి తమ సమస్యలు చెప్పినా, చాలా ఏకాగ్రతతతో ఆ సమస్యని పరిష్కరించడానికి పూనుకుంటారు. కుటుంబ సభ్యుల, మిత్రుల, మిత్రుల భార్యల సమస్యలు విని సానుభూతితో స్పందిస్తారు.

నిజాయితీగా వుండటం మంచి లక్షణమే. కానీ అవసరమైన దానికన్నా అతిగా వుండే నిజాయితీ ఎవరికీ లాభించదు. వీరు ఇతరుల గాథలు విని, వాటిని పరిష్కరించడంలో చూపే 'ఇన్వాల్వ్‌మెంట్', సొంతకుటుంబసభ్యుల పట్ల వుండదు. కొడుకు వచ్చి సమస్య చెప్పుకున్నా, రోడ్డుమీద పోయే ఐస్‌ఫ్రూట్ వాడొచ్చి సమస్య చెప్పుకున్నా ఒకేరకంగా స్పందించడం వల్ల, వీరి పిల్లలకి వీరిపై తగినంత ప్రేమానురాగాలు వుండవు. అదీకాక వీళ్లు కేవలం సమస్య వింటారేతప్ప, ఆ సమస్యలకి పరిష్కార మార్గాలు చెప్పరు. ఒకవేళ చెప్పినా అవతలివాడు ఆచరించడానికి వీలుగా వుండవు.

దురదృష్టవశాత్తు మూర్తీభవించిన నిజాయితీతో వుండే భర్తలకి, సరదాగా వుండే భాగస్వాములొస్తే యిక వాళ్ళకి గృహం నరకప్రాయమే అవుతుంది. భార్యతో కలిసి సరదాగా ఏ సినిమాకో, గుడికో వెళ్ళవలసిన టైములో అదే వీధిలో వున్న ఒకాయన భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందంటే, ఆవిడని తీసుకురావడానికి తోడు రమ్మంటే, పెద్దమనిషిలాగా ఆ విషయంలో సాయం చేసేందుకు అవతలి ఊరికి ప్రయాణమవుతాడు.

ఇతరుల సమస్యల్ని పరిష్కరించడంలో వున్న ఆనందం తమ వాళ్ళకి ఆనందాన్ని పంచడంలో వుండదు. ఈ విషయంలో వీళ్ళకి 'సంబరాల రాంబాబు'లకి కాస్త పోలిక వుంది.

వీళ్ళు పిల్లల విషయంలో ఏ కష్టమొచ్చినా చాలా తీవ్రంగా స్పందిస్తారు. ఇటువంటివాళ్ళ పిల్లలు, అన్ని వసతులూ అమరటం వల్ల స్వయంగా ఏ పనీ చేసుకోలేక, అన్నిటికీ అవతలి వారిపై ఆధారపడేలాగ తయారవుతారు. ఇలాంటి తల్లిదండ్రులు పిల్లల్ని బాగా పెంచాలంటే ఈ క్రింది అలవాట్లు అలవర్చుకోవాలి.

1. ఎవరి సమస్యైనా ఓపికగా వినే గుణం వుంది కాబట్టి, తమ పిల్లలు, భార్య చెప్పే విషయాలకి మరింత ప్రాముఖ్యత యివ్వటం నేర్చుకోవాలి.
2. తమ కుటుంబంలోని సభ్యులకి, వీధిలో వాళ్ళకన్నా ఎక్కువ ప్రాముఖ్యత యిస్తున్నామన్న విషయం తమ కుటుంబ సభ్యులకి తెలిసేలాగ చేయాలి.
3. తమ జీవితం మరీ యాంత్రికంగా మారకుండా అప్పుడప్పుడు కాస్త మార్పుకి అవకాశం ఇవ్వాలి.

4. తమ సొంత బాధలకు, బాధ్యతలకు, సమస్యలకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలి.

5. ఇతరుల కోసం బ్రతికినట్లు కాకుండా తమకోసం తాము బ్రతకాలి. ఆ ఇతరుల సమస్యలు వినడమే కార్యక్రమంగా పెట్టుకోకుండా, తమ సమస్యలని కూడ భార్యాబిడ్డలతో కలిసి చర్చించాలి.

భూతద్దం తల్లిదండ్రులు :

ప్రతి చిన్న విషయాన్ని వీరు గోరంతలు కొండంతలు చేస్తారు. మనం సంతోషంగా వున్నామా? మన కుటుంబం సంతోషంగా వుందా? ఇతర కుటుంబాలు సంతోషంగా వున్నాయా? ఇలాంటి భావాలు వీళ్ళకు ఎప్పుడూ కలుగుతుంటాయి. వీరు ప్రతి చిన్న విషయాన్నీ నమ్ముతుంటారు. ప్రతి విషయాన్ని ఒక పరిధిలో ఆలోచిస్తుంటారు. ఎప్పటికప్పుడు వీరు తమకి, తమ పిల్లలకీ సరిహద్దులు నిర్మిస్తుంటారు. ఉదాహరణకి స్కూల్ తరువాత పిల్లలు ట్యూషన్ కెళ్ళాల్సి వుంటే, ఆ ట్యూషన్ స్కూల్‌కి చాలా దూరమయితే వాహనం కావాలి. ఈ రవాణా సమస్యని ఒక పెద్ద సమస్యగా చేసి, దాని గురించి నానాయాగీ చేసి, తీవ్రంగా ఆలోచించి పరిష్కారాన్ని పొందుతారు. ఆ పరిష్కారం దొరికేవరకు వాళ్ళు మామూలుగా వుండరు, అవతలివాళ్ళని మామూలుగా వుండనివ్వరు.

వీరికుండే సున్నితమైన మనస్తత్వం మరెవరికీ వుండదు. వీరు ప్రతి పనీ క్రమబద్ధంగా జరగాలని అనుకుంటారు. వీళ్ళలో మళ్ళీ రెండు రకాలు. మొదటిరకం వాళ్ళతో పెద్ద చిక్కేమిటంటే వీళ్ళు గొప్ప ఎస్కేపిస్టులు. సమస్యని ఎదుర్కోవడానికి బదులు అసలు సమస్యేలేదని భావిస్తుంటారు.

రెండో రకం వాళ్ళు పై పేరాలో చెప్పినట్లుగా చిన్న విషయం కూడ పెద్దది చేస్తారు. ఉదాహరణకి 'ఈ రోజు సిటీ బస్సు స్ట్రయిక్ నాన్నా' అని పిల్లలు చెబితే, పిల్లల్ని స్కూల్‌కి ఎలా పంపాలా అని అరగంట ఆలోచిస్తారు.

'ఆటోలో పంపితే ఎలా? బంద్ రోజున ఆటోలపై రాళ్ళు రువ్వుతారేమో? తాము వెళ్ళి దింపితే వచ్చే నష్టమేమిటి?' ఇలా ఒక అరగంట ఆలోచనలు చేసి, చివరికి పిల్లల్ని ఆ పూట స్కూలు మానేయమనే సలహాతో ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తారు.

ఒక ఆర్కిటెక్ట్ తను గీచిన ప్లాను తు.చ తప్పకుండా ఒక బిల్డింగ్‌ని కట్టడానికి ఎలా ప్రయత్నిస్తాడో, అలాగే వీళ్ళు కూడా తాముచేసే ప్రతిపనీ సక్రమంగా, క్రమశిక్షణతో, ఒక పద్ధతిలో చేయాలని కోరుకుంటారు.

ఇలాంటి తల్లిదండ్రులు ఈ గ్రూపులోకి వస్తారు. వీరికి, నియంతల టైపు తల్లిదండ్రులకి తేడా ఏమిటంటే - నియంతలు తాము పట్టిన కుందేలుకి మూడేకాళ్ళని వాదిస్తే, వీళ్ళు తామసలు కుందేలునే పట్టలేదనే భావంతో పనిచేయటం ప్రారంభిస్తారు.

మీరెప్పుడూ 'మనం సరదాగా వున్నామా? మనమసలు ఎంజాయ్ చేస్తున్నామా?' అనే ప్రశ్నలు వేసుకోరు. ఈ పని సక్రమంగా చేస్తున్నామా, లేదా? అని మాత్రమే ప్రశ్నించికుంటారు. ఉదాహరణకి వీళ్ళు ఒక కొత్తరకం వంట పుస్తకం చూసి నేర్చుకుంటే అందులో యేం వుంటే అదే చేస్తారు తప్ప కొద్దిగా స్వంత తెలివి ఉపయోగించడానికి గాని, కొత్త ప్రయోగం చేయడానికి గానీ ఉత్సాహం చూపించరు.

ఈ టైపు స్త్రీలు గర్భవతులు అయితే డాక్టర్ దగ్గరకు వెళ్ళడం దగ్గిరనుంచి ఏ టైంలో ఏ టాబ్లెట్ వేసుకోవాలనే విషయం వరకు సరిగ్గ నిమిషాలు సెకన్లతో సహా కరెక్టుగా అమలుపరుస్తుంటారు. 'పిల్లల్ని యెలా పెంచాలో ఏం చదివించాలి? కట్నమెంత ఇవ్వాలి? అన్న విషయాలు కూడా గర్భవతులుగా వున్నపుడే ఆలోచిస్తారు.

ఇలా ఫర్‌ఫెక్ట్‌గా, పద్ధతిగా వుండే తల్లిదండ్రులతో పిల్లలకు సమయం క్రమశిక్షణ, వాటి విలువ తెలుస్తాయే తప్ప - జీవితంలో ఆనందం వుండదు. ఎక్కడికైనా పార్టీకిగాని, మీటింగ్‌కు గాని వెళ్ళాలనుకుంటే కరెక్టుగా ఆ టైంకే వెళతారు. ప్రతి శనివారం సినిమాకి వెళ్ళాలనే నియమం వుంటే శనివారమే వెళ్ళాలి తప్ప, ముందురోజు చూడాలనిపించినా చూడటానికి వీళ్ళతో వీలుపడదు.

ఇలాంటి తల్లిదండ్రుల పిల్లలు, ఒక విధంగా అన్ని అవసరాలు సమయానికి అమరుతుండటం హాయిగానే వున్నా, ఆ తల్లిదండ్రులు మాత్రం ఎంతో భారాన్ని ఫీలవుతూ వుంటారు. ఏ మాత్రం పొరపాటు జరిగినా, ఆందోళన పెరిగి ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది.

వీళ్ళకు ఒక్కొక్కసారి సమస్య ఎక్కువై భార్యా పిల్లలమీద కోపం వచ్చినా కూడా మౌనాన్ని ఆశ్రయిస్తారు తప్ప కోపాన్ని వెలిగక్కరు. ఇలాంటి తల్లిదండ్రుల్లో మంచి మార్పు తీసుకురావాలంటే -

1. తాము నిర్మించే సరిహద్దులు ఎంతవరకు సమంజసమో వీరే ఆత్మ విమర్శ చేసుకోవాలి.
2. వంటింట్లోకి రాకూడదు....... పగలు పక్క ఎక్కకూడదు..... ఇలాంటి స్ట్రిక్టు ప్రిన్సిపుల్స్‌ని సాధ్యమైనంతవరకు వదులుకోవాలి.
3. వీళ్ళు పిల్లల్ని పెంచడమనే పాఠాన్ని కిండర్‌గార్డన్ స్థాయినుంచి నేర్చుకోవాలి.
4. తమని పొగిడేవాళ్ళే స్నేహితులు, తమని విమర్శించేవాళ్ళు శత్రువులు అన్న భావాన్ని విడిచిపెట్టాలి.
5. విపరీతమైన శుభ్రతతో 'ఇల్లు యెప్పుడూ నీటుగా వుండాలి' అన్న ధోరణిని వదిలిపెట్టి, 'చిన్నపిల్లలున్నప్పుడు కొంత సర్దుబాటు తప్పదు' అన్న అలవాటు చేసుకోవాలి.

6. ఇతరుల్లో అన్నీ మంచి గుణాలేవుండి, ఒక్కటే చెడ్డగుణం వుంటే - ఆ ఒక్క గుణాన్నే భూతద్దంలో చూసి ద్వేషించకుండ, మంచి గుణాలు చూసి ప్రేమించే అలవాటు చేసుకోవాలి.
7. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు, ఇతరులతో విభేదించాల్సి వస్తే అలా విభేదించడం వివాదానికి దారి తీస్తుందని, మౌనాన్ని ఆశ్రయించకూడదు. నిర్లిప్తంగా వుండడం మంచిదని అనుకోకూడదు.

***

ఇలా నాలుగు రకాల తల్లి దండ్రుల మనస్తత్వాల్ని మనం విశ్లేషించి చూపాం. ప్రతి తల్లీ - తండ్రీ ఏదో ఒక వర్గానికి చెందినవారై వుంటారు. కాంబినేషన్స్ ఒక్కొసారి విపరీతంగా వుంటే ఆ పిల్లలకి యిక నరకమే. మర్యాద రామన్న తండ్రి, నియంత తల్లి భార్యాభర్తలయితే ఆ యింట్లో తల్లే పిల్లల్ని కంట్రోల్ చేస్తుంది.

సంబరాల రాంబాబు తడ్రి, భూతద్దం తల్లి భార్యాభర్తలయితే పొద్దున్నే తండ్రి చదివి పారేసిన పేపరు తీయడం నుంచి, సాయంతం ఆయన కంచం తీయడం వరకు ఆవిడ సణుగుళ్ళే ఆ ఇల్లంతా ప్రతిధ్వనిస్తుంటాయి.

తల్లిదండ్రుల్లో ప్రతివారూ ఈ నాలుగు కేటగిరిల్లో ఏదో ఒకదానికి చెందుతారని కూడా అనుకోనక్కరలేదు. ఒక కేటగిరిలో కొన్ని గుణాలు, మరొక కేటగిరిలో మరికొన్ని గుణాలు వున్న మిక్స్‌డ్ క్వాలిటీస్ వ్యక్తులు కూడా వుండవచ్చు.

ఒక్కొక్కసారి కాలం గడిచేకొద్దీ మనలో యెన్నో మార్పులొచ్చి మన వ్యక్తిత్వం మారుతూ వుండవచ్చు. సంబరాల రాంబాబు టైపులో వున్న తండ్రి కొంతకాలానికి నియంత టైపులోకి మారవచ్చు. అదే విధంగా ఎప్పుడూ తనమాటే నెగ్గాలనుకునే తండ్రి, అనారోగ్య దృష్ట్యా అందరిమీద ఆధారపడే వాడవచ్చు.

ఒక్కొక్కసారి మన అభిప్రాయాన్ని, మన వ్యక్తిత్వాన్ని, మన మనస్తత్వాన్ని పక్కన పెట్టి పిల్లలకు సహాయపడవలసి వుంటుంది. తప్పటడుగులు వేసే పిల్లలు ఇంట్లో వున్నప్పుడు, వాళ్ళకు హాని కలిగించే వస్తువులు వాళ్ళకు దూరంగా వుంచాలి. మనం ప్రతిదీ క్రమశిక్షణలో, పద్ధతిలో వుంచాలనుకోవడం తప్పవుతుంది. పిల్లలు ఎదిగేకొద్దీ మన వ్యక్తిత్వాన్ని ఒక స్థాయినుంచి, మరొక స్థాయికి పెంచుకోవలసి వస్తుంది.

పిల్లలు చిన్నవయసులో వున్నప్పుడు సంబరాల రాంబాబులా వుండే తండ్రి పిల్లలు పెద్దయ్యాక కొంత మర్యాద రామన్న టైపుకి మారవలసి వుంటుంది. పిల్లలు మరీ చేతుల్లోంచి జారిపోతున్నారని తెలిసినప్పుడు ఒక నియంత తండ్రిగా మారవలసి వుంటుంది.

పిల్లలయొక్క అస్వాభావికమైన చర్యలపట్ల (ఉదాహరణకి పిల్లల నోట్‌బుక్స్‌లో ప్రేమలేఖలు కనిపించినప్పుడు) భూతద్దం తల్లిదండ్రులుగా మారవలసి వుంటుంది. ఈ నాలుగు

రకాల తల్లిదండ్రులలోనూఇది మంచీ, ఇది చెడూ అని లేదు. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క స్వభావాన్ని ఆపాదించుకోవలసి వుంటుంది.

పిల్లలకి పదహారేళ్ళ వయసొచ్చి కాలేజీలోకి అడుగుపెడుతున్నప్పుడు "ప్రపంచమంతా బాగులేదు. మనమొక్కరమే బాగున్నాం" అనే ధోరణి, ఆవేశం, తిరుగుబాటు తత్వంలో వుంటారు. ఈ ఆవేశం, తిరుగుబాటు తత్వం మరీ ఎక్కువగా వున్నప్పుడు మనం నియంతలుగా వ్యవహరించకుండా మర్యాద రామన్నలాగానో, సంబరాల రాంబాబులాగాలో వ్యవహరించవలసి వుంటుంది.

అంతా తమకే తెలుసు, పిల్లలకేమీ తెలియదు అన్న ధోరణిని ఒక వయసులో తల్లిదండ్రులు వదిలిపెట్టవలసి వుంటుంది. ఇప్పుడు జనరేషన్ మారింది. ఈ మారుతున్న జనరేషన్‌లో మన పిల్లలు నిశ్చయంగా మనకన్నా తెలివైనవాళ్ళు, కష్టపడే వాళ్ళు, విషయం పరిజ్ఞానమున్నవాళ్ళు. అందువల్ల నియంతృత్వం పనికిరాదు.